https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 37 ఆదివారం 31-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై రాళ్లు, కోడి గుడ్లతో దాడి



**పశ్చిమ బెంగాల్ మే 30**

ఇటీవలి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరిగిన హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన టీఎంసీ నేత, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. సోనార్‌పూర్‌కు వెళ్లిన ఆయనపై కొందరు రాళ్లు, కోడి గుడ్లతో దాడి చేశారు. మరికొందరు దొంగా..దొంగా.. అంటూ బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో, సెక్యూరిటీ సిబ్బంది ఆయనను వెంటనే అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లిపోయారు. ఈ ఘటనపై అభిషేక్ బెనర్జీ స్పందించారు. ఈ దాడి వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. 'వాళ్ల దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే ఇదే. ఎన్నికలు పూర్తై నెల కూడా కాలేదు. పోలీసులు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించట్లేదు' అని మీడియాతో అన్నారు. తాను సోనార్‌పూర్‌కు వస్తున్నట్టు ముందే సమాచారం ఇచ్చినా అధికారులు ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదని అరోపించారు. పోలీసులు, ఇతర భద్రతా దళాలు ఇక్కడకు వచ్చే వరకూ తాను అంగుళం కూడా కదిలేదిలేదని చెప్పారు. స్థానిక రోడ్లు, ఇతర మౌలిక వసతులు సరిగా లేవని కొందరు నిరసనకు దిగినట్టు తెలుస్తోంది. వానాకాలంలో రోడ్లు జలమయం అయ్యి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని, మంచినీటి సరఫరాను మెరుగు పరచాలని తాము గతంలో ఎన్నిసార్లు అభ్యర్థించినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని చెప్పారు. టీఎంసీ 15 ఏళ్లుగా అధికారంలో ఉన్నా తమ ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు.

# అబద్ధాల కుటుంబం!



**కేసీఆర్ పరివారంలో అందరి డీఎన్ఏ అదే**

**ఉద్యమంలో వాళ్ల అబద్ధాలను సమర్థించాం**

**సొంత రాష్ట్రం వచ్చినా అసత్యాలు మానలేదు**

**మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే 30**

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మీటర్లు పెట్టినా, ఉచిత విద్యుత్ రద్దుచేసినా వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేయబోమని అన్నారు. తాము మాట మీద నిలబడితే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా? అని సవాలు విసిరారు. "రాష్ట్రంలో మూడేళ్లలో ఎప్పుడూ లేనట్లుగా అకాల వర్షాలు వచ్చాయి. రైతు బాధలో ఉన్నాడు. పరామర్శించడానికి వెళ్లే నేతలు రెండు లక్షలో, ఐదు లక్షలో సాయం చేయాలి కానీ మీరు చేస్తుందేంటి? ఓట్ల రాజకీయం. అదీ ఒక బతుకేనా?" అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి ధ్వజమెత్తారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. చివరి ధాన్యం గింజ వరకు తడిసినదైనా మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని, ఆ తర్వాత కేంద్రం వాటిని కొనకుంటే కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ల ఇళ్ల ముందు పోస్తామని హెచ్చరించారు. దేశంలో 54 డిస్కమ్‌లు ఉంటే తెలంగాణ డిస్కమ్‌లు రెండూ 52, 54వ స్థానాల్లో ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు అవి తొలి ఆరు స్థానాల్లో ఉండేవన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.70వేల కోట్ల నష్టాలతో వాటిని కోలుకోకుండా చేశారని చెప్పారు. విద్యుత్ సంస్థలేవీ ప్రజలకు ఉచిత విద్యుత్ ఇవ్వవని, ఆ సొమ్మును ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాలు చెల్లించకపోవడంతో బకాయిలు కొండల్లా పేరుకుపోయి డిస్కమ్‌లు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని చెప్పారు. జెన్‌కోలు సమయానికి డబ్బులు ఇవ్వవు కాబట్టి సింగరేణి అమ్మే బొగ్గుకు నాలుగింతల ధర వేస్తోందని చెప్పారు. ఇలా విద్యుత్తు సంస్థలు, సింగరేణి అన్నీ దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇవేవీ పరిష్కరించుకుండా సింపుల్‌గా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వల్ల విద్యుత్ సంస్థలు నష్టాల పాలవుతున్నాయనే సాకుతో అధికారులు తప్పించుకొనే అవకాశం ఏర్పడుతోందని చెప్పారు. వాస్తవానికి రైతులకు సరఫరా చేసిందెంతో తేలితే కానీ, అందులో పారదర్శకత వస్తేగానీ విద్యుత్ సంస్థలను నిలదీసి లాభాలబాట పట్టించడం కుదరదని అన్నారు. సౌర విద్యుత్ వచ్చాక పగటి సమయంలో ఒక్కోసారి ఉచితంగా కూడా డిస్కమ్‌లకు కరెంటు అందుతోందని గుర్తు చేశారు. టమాటా బాగా పండిన రోజుల్లో రైతు పది పైసలకు కిలో అమ్మినట్లే కరెంటు మార్కెట్లో ఒక్కోసారి ఉచితంగా లేదా పది పైసలకు యూనిట్ విద్యుత్ దొరుకుతోందని చెప్పారు. రాత్రిపూట పీక్ టైమ్‌లో విద్యుత్ కొనుగోలు చేస్తే యూనిట్‌కు రూ.10 చెల్లించాల్సి వస్తోందన్నారు. మొత్తం కరెంటు బిల్లును యావరేజ్ చేసి రైతులకు ఇంత ఖర్చవుతోందని ప్రభుత్వం ఖాతాలో విద్యుత్ సంస్థలు బిల్లు వేస్తున్నాయని చెప్పారు. ఇలా బాధ్యత నుంచి తప్పించుకొనే వ్యవహారం లేకుండా పారదర్శకంగా బిల్లింగ్ చేయించే లక్ష్యంతోనే రైతు డిస్కమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రైతు డిస్కంలో ఎత్తిపోతల పథకాలు, పంపుసెట్లు, మెట్రో వాటర్ వర్క్స్, మిషన్ భగీరథ నీటి సరఫరాలను చేర్చామని వివరించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు చేసిన తర్వాత రాత్రి సమయాల్లో యూనిట్ రూ.10కి కొనుగోలు చేసిన భారం రైతుల ఖాతాలో వేసేందుకు అవకాశం ఉండదని చెప్పారు. రైతులు 90 శాతం పగటిపూటే విద్యుత్తును వాడుకుంటున్నారని, రాత్రి పూట కేవలం పదిశాతమే వాడుకుంటున్నారని తెలిపారు. రైతు డిస్కమ్ ఏర్పాటు చేసినా 24 గంటలూ రైతుకు కరెంటు సరఫరా చేస్తామని చెప్పారు. విద్యుత్ సంస్థల్లో బాధ్యత, నాణ్యత, పారదర్శకత పెంచేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్‌కు దళాలు సిద్ధం

**సరిహద్దుల్లో అప్రమత్తంగా త్రివిధ దళాలు**

**శత్రు కదలికలపై నిరంతర నిఘా**

**ప్రజల మద్దతు ఎంతో కీలకం**



**న్యూఢిల్లీ, మే 30**

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఆయన, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టేందుకు త్రివిధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం నెలకొన్న ప్రశాంతతను శాశ్వత పరిస్థితిగా భావించరాదని, అది కేవలం తాత్కాలికమే కావచ్చుని హెచ్చరించారు. దేశ భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని సైన్యం నిశితంగా పరిశీలిస్తోందని జనరల్ ద్వివేది తెలిపారు. శత్రు దేశాల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైనిక దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ఆధునిక యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం మధ్య సమాచార మార్పిడి, వ్యూహాత్మక సహకారం పటిష్ఠంగా కొనసాగుతోందన్నారు. యుద్ధరంగంలో ప్రతి కదలికను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సైనికుల భద్రతతో పాటు పౌరుల రక్షణ కూడా తమకు అత్యంత ప్రాధాన్యమని జనరల్ ద్వివేది స్పష్టం చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని రక్షణ దళాలు ఇరవై నాలుగు గంటలూ అప్రమత్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ విషయంలో ఎల్లప్పుడూ అత్యున్నత స్థాయి సన్నద్ధత కొనసాగుతోందన్నారు. సమాచార యుద్ధం ఆధునిక కాలంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆయన, ఈ రంగంలో విజయం సాధించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా వ్యాపించే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. అధికారిక వర్గాల ద్వారా విడుదలయ్యే సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని కోరారు. దేశ ప్రజలంతా ఒకే లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే శత్రువుల కుట్రలను సమర్థంగా తిప్పికొట్టగలమని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. జాతీయ భద్రత అనేది కేవలం సైన్యం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని అన్నారు. దేశ రక్షణ విషయంలో ప్రజల అప్రమత్తత, ఐక్యత, విశ్వాసం ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు.

# వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

**- రైతులకు ఇబ్బందులు రాకూడదు**

**- ధాన్యం తరలింపుపై సమీక్ష - అధికారులకు మంత్రి ఆదేశాలు**


**సంగారెడ్డి, మే 30**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్తో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం ఎంత మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందో, ఇప్పటివరకు ఎంత మేర కొనుగోలు జరిగిందో, ఎంత ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతుల ఖాతాల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో జమ అవుతున్నాయా లేదా అనే అంశంపై కూడా వివరాలు సేకరించారు.ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాల లభ్యత, రవాణా ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీసిన మంత్రి, ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి నిల్వ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టి రైతుల పంట నష్టపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై యూఏఈ రహస్య దాడులు?

- వెలుగులోకి వచ్చిన సంచలన కథనం
- ఇంధన కేంద్రాలపై లక్ష్యంగా దాడులు
- గల్ఫ్ దేశాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలు




**వాషింగ్టన్,మే 30**

ఇరాన్‌పై ఇప్పటి వరకు అమెరికా, ఇజ్రాయెల్ మాత్రమే ప్రత్యక్షంగా సైనిక చర్యలు చేపట్టాయని ప్రపంచవ్యాప్తంగా భావిస్తూ వచ్చారు. అయితే తాజాగా వెలుగులోకి వచ్చిన అంతర్జాతీయ మీడియా కథనాలు పశ్చిమాసియా దేశమైన యూఏఈ కూడా రహస్యంగా ఇరాన్‌పై దాడులు నిర్వహించినట్లు సూచిస్తున్నాయి. ఈ అంశం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలను స్వతంత్రంగా ధృవీకరించలేదని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ఉటంకిస్తూ వచ్చిన నివేదికల ప్రకారం, అమెరికా, ఇజ్రాయెల్ అందించిన నిఘా సమాచారంతో యూఏఈ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. హర్మూజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లోని ఇరాన్‌కు చెందిన ఇంధన మౌలిక వసతులు, ఆయిల్ రిఫైనరీలు, పెట్రోకెమికల్ కేంద్రాలపై లక్ష్యంగా దాడులు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా లావన్ దీవిలోని రిఫైనరీపై దాడి జరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇరాన్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించింది. యూఏఈ కూడా అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరిస్తోందనే ఆరోపణలతో ఇరాన్ తరచూ లక్ష్యంగా చేసుకున్నట్లు కథనాలు చెబుతున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి యూఏఈపై వేల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. కొన్ని దాడులు చమురు నిల్వ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, పౌర మౌలిక వసతులపై ప్రభావం చూపినట్లు సమాచారం. ఇరాన్ దాడులకు ప్రతీకారంగానే యూఏఈ కఠిన వైఖరి అవలంబించినట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై ఉమ్మడి సైనిక చర్యకు దిగాలని యూఏఈ ప్రతిపాదించిందని, అయితే సౌదీ అరేబియా దీనికి మద్దతు ఇవ్వలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలని సౌదీ భావించినట్లు సమాచారం.

## చైనా అణు స్థావరాల విస్తరణ

**- ఎడారిలో భారీ నిర్మాణాలు**

**- పెరుగుతున్న క్షిపణి సామర్థ్యాలు - శాటిలైట్ చిత్రాల్లో వెల్లడి**

**బీజింగ్, మే 30**



చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలో ఉన్న ఎడారి ప్రాంతాల్లో భారీ స్థాయిలో సైనిక నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చిన శాటిలైట్ చిత్రాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా అణు ఆయుధాలకు సంబంధించిన స్థావరాల వద్ద కొత్త నిర్మాణాలు చేపడుతున్నట్లు అంతర్జాతీయ రక్షణ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఉయ్‌గర్ ప్రాంతంలోని సైనిక సముదాయాల వద్ద కొత్త లాంచ్ ప్యాడ్లు, భూగర్భ బంకర్లు, సమాచార ప్రసార కేంద్రాలు నిర్మిస్తున్నట్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించినట్లు నివేదికలు వెల్లడించాయి. దీర్ఘశ్రేణి క్షిపణుల నిర్వహణకు అనువుగా ఈ నిర్మాణాలు రూపొందిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఖండాన్ని చేరగల సామర్థ్యం కలిగిన క్షిపణుల మోహరింపుకు ఈ ప్రాంతాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం ఉయ్‌గర్ ప్రాంతంలోని సైనిక కేంద్రం వద్ద దాదాపు ఎనభైకి పైగా లాంచ్ ప్యాడ్ల నిర్మాణం కొనసాగుతోంది. దీనితో పాటు మొబైల్ క్షిపణి ప్రయోగ వాహనాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆధునిక సైనిక పరికరాల మోహరింపును కూడా చైనా పెంచుతున్నట్లు సమాచారం. గతంలో ఈ ప్రాంతంలో ఇంత విస్తృత స్థాయిలో నిర్మాణాలు కనిపించలేదని నిపుణులు చెబుతున్నారు. శాటిలైట్ దృశ్యాల విశ్లేషణలో భాగంగా ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు, ఉపగ్రహ సమాచార కేంద్రాలు, కమాండ్ నియంత్రణ కేంద్రాల నిర్మాణం కూడా కొనసాగుతున్నట్లు గుర్తించారు. ఆధునిక యుద్ధ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సైనిక మౌలిక వసతులను బలోపేతం చేసే ప్రయత్నంగా దీనిని విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తులో వ్యూహాత్మక ప్రతిస్పందన సామర్థ్యాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఈ చర్యలు ఉన్నట్లు భావిస్తున్నారు. అణు దళాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రత్యేక రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎడారి ప్రాంతంలోని వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ భద్రతా పరిశోధకులు పేర్కొంటున్నారు. భూగర్భ సదుపాయాలు, అత్యవసర కమాండ్ కేంద్రాలు కూడా ఈ ప్రణాళికలో భాగమై ఉండవచ్చని చెబుతున్నారు. చైనా చేపడుతున్న ఈ నిర్మాణాలు ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక సమతౌల్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిన్‌జియాంగ్ ప్రాంతంతో పాటు ఘాన్సు ప్రావిన్సులోని అణు స్థావరాల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ చర్యలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నిర్మాణాలపై చైనా ప్రభుత్వం అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు.

## అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు..

బాల్క సుమన్ అరెస్టును నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకుల రాస్తారోకో..



**రామకృష్ణాపూర్, మే 30, (మన సమాజం):**
ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా అని పట్టణ బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బాల్క సుమన్ అక్రమ అరెస్టును ఖండిస్తూ బొక్కలగుట్ట జాతీయ రహదారిపై నాయకులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో 1600 కోట్ల బొగ్గు స్కాం జరిగితే ఈ ప్రాంతం కార్మికుల ఓట్లతో గెలిచిన సుమన్ కార్మికుల పక్షాన మాట్లాడితే అరెస్టులు చేయడం సిగ్గు చెటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రేవంత్ సర్కార్ కు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. చెన్నూరు ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రొద్బలంతోనె బాల్క సుమన్ ను అక్రమంగా అరెస్ట్ చేశారని, చెన్నూరు ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ వీనంక శ్రీనివాస్, నాయకులు రామిడి కుమార్, జాడీ శ్రీనివాస్, అలుగుల సత్తయ్య, చంద్రమౌళి, రాజు, సతీష్, మహేష్, పాల్గొన్నారు.

## కౌన్సిల్ సాధారణ సమావేశం..



**రామకృష్ణాపూర్, మే 30, (మన సమాజం):**
పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఛైర్మెన్ గోడిసేల సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రేవిన్యూ అధికారి సతీష్ నాలుగు అంశాలతో కూడిన ప్రతిపాదనలు చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న కోతులను పట్టుకోవడం, నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రోడ్డుకు ఇటువైపులా ఉన్న మొక్కలు తొలగించడం, రెండు నెలలు అద్దె ప్రాతిపదికన పారిశుద్ధ పనుల కొరకు రెండు ట్రాక్టర్లు, 2డ్రైవర్లు, 6గురు లేబర్లను తీసుకొనుటకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 4 స్వచ్ఛ ఆటోలను సభ్యులు ప్రారంభించారు. ఈ సమావేశంలో కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్ ఛైర్మెన్ మిట్టపల్లి సరిత, కౌన్సిలర్లు, డిఇ సుమతి, ఎఇ అశ్రీత్, సిబ్బంది పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఎస్ఐఆర్ గూర్చి మీటింగ్

**కథలాపూర్ మే 30**
కథలాపూర్ మండలకేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఈరోజు మండల కేంద్రంలో ూ×= గురించి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ూ×= కార్యక్రమం ద్వారా దేశంలోని బోగస్ ఓట్లను ఏరివేసి ఓటుకు పూర్తి బాధ్యత కల్పిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేసారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి,జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కథలాపూర్ మహేష్,ప్రధాన కార్యదర్సులు నరెడ్ల రవి, గడ్డం జీవన్,వొద్దాటి సునీల్,సీనియర్ నాయకులు గాందారి శ్రీనివాస్,కాసోజీ ప్రతాప్,ముంజ వెంకటేష్,మల్లేష్,సత్యం పాల్గొన్నారు.

### సమస్యలపై స్పందించే నాయకుడు మనకు ఉండడం

## మన నియోజకవర్గ ప్రజల అదృష్టం

**కథలాపూర్ మే 30 :** కథలాపూర్ మండలం అంబర్పేట గ్రామానికి 10 లక్షల 80 వేల రూపాయలు స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు మంజూరు చేయడం జరిగింది, ఇట్టి విషయాన్ని కథలాపూర్ మండల్ కాంగ్రెస్ కార్యదర్శి అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకుడు జవాజీ రవి గారు తెలుపుతూ అంబర్పేట మున్నూరు కాపు కమిటీ హాల్ కు గాను నాలుగు లక్షల రూపాయలు అలాగే విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ తరపున నిర్మిస్తున్న వీర బ్రహ్మంగారి గుడి నిర్మాణానికై నాలుగు లక్షల రూపాయలు, అలాగే ఇటీవల గ్రామంలోని ఈత వనం దగ్ధం అవడంతో గౌడ్ అన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది ఇట్టి విషయాన్ని తటస్థంగా పరిశీలించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీనివాస్ గారు తక్షణ సహాయం కింద రెండు లక్షల ఎనభై వేలు రూపాయలు రిగ్గు బోర్ మరియు పైపులైను గాను మంజూరు చేయడం జరిగింది, తమ గ్రామానికి నిధులను మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు అలాగే తమ ఈత వనం దగ్ధం అవడంతో ఏర్పడిన నష్టాన్ని తటస్థంగా పరిశీలించి తక్షణ సహాయం అందించినందుకు గాను గౌడ అన్నలు స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గవర్నమెంట్ పాలిటెక్నిక్ బెల్లంపల్లి విద్యార్థుల ఘన విజయం

### TG ECET-2026 మైనింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అగ్ర ర్యాంకులు



**బెల్లంపల్లి, మే 30, మన సమాజం**
గవర్నమెంట్ పాలిటెక్నిక్, బెల్లంపల్లి విద్యార్థులు తెలంగాణ ఈసెట్ (౧+ జుజజు--2026) పరీక్షలో మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ర్యాంకులను సాధించారు. కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 1వ, 2వ, 5వ ర్యాంకులను కైవసం చేసుకుని సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచారు. రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించిన సామల మహేష్ తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. దేవేందర్ నాయకత్వం, మైనింగ్ ఇంజినీరింగ్ అధ్యాపకుల నాణ్యమైన శిక్షణ కారణమని తెలిపారు. భవిష్యత్తులో గేట్ (+ూజు) పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి, ఐఐటీలో ఉన్నత విద్యను అభ్యసించి, సింగరేణి లేదా కోల్ ఇండియా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో మైనింగ్ ఇంజినీర్గా సేవలందించాలనే లక్ష్యాన్ని వెల్లడించారు.రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించిన మొహమ్మద్ కాజిముద్దీన్మాట్లాడుతూగవర్నమెంట్ పాలిటెక్నిక్ బెల్లంపల్లిలోని ఉత్తమ విద్యా వాతావరణం, ప్రిన్సిపాల్ డా. ఎం. దేవేందర్ మార్గదర్శకత్వం, విభాగాధిపతి శ్రీ ఆంథోనీ పర్యవేక్షణ, అధ్యాపకుల నిరంతర కృషి తన విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. మైనింగ్ రంగ అభివృద్ధికి తన వంతు సేవలు అందించే నైపుణ్యం కలిగిన మైనింగ్ ఇంజినీర్గా ఎదగాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించిన కె. సాయి చరణ్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్కు బదులుగా పాలిటెక్నిక్ విద్యను ఎంచుకోవాలని తన కుటుంబ సభ్యులు ప్రోత్సహించడం, అధ్యాపకుల నిరంతర సహకారం తన విజయానికి కారణమని చెప్పారు. భవిష్యత్తులో కోల్ ఇండియా సంస్థకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. దేవేందర్ మరియు అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 1వ, 2వ, 5వ ర్యాంకులతో పాటు మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో కళాశాలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు టాప్-30 ర్యాంకుల్లో స్థానం సంపాదించడం విశేషమని తెలిపారు, ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ని కలిసిన

# కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్..




**కోరుట్ల. మే.30**
జగిత్యాల జిల్లా.కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదాల కారణంగా భారీగా దగ్ధమైన ఈత వనాల సమస్యపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ఈరోజు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. మెట్పల్లి మండలం మెట్లచిట్టాపూర్, పెద్దాపూర్, కొనరావు పేట కోరుట్ల మండలం సంగెం, ఐలాపూర్, మాధాపూర్, చిన్నమెట్పల్లి, మోహన్రావుపేట్, కోరుట్ల పట్టణ పరిధి, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ తదితర గ్రామాల్లో తీవ్ర ఎండల కారణంగా జరిగిన అగ్నిప్రమాదాల్లో సుమారుగా 18,100 ఈత చెట్లు దగ్ధమయ్యాయని, దీంతో వందలాది గౌడ కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ద్వారా వెంటనే నష్ట అంచనా సర్వే నిర్వహించి తగిన పరిహారం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే అగ్నిప్రమాదాలు సంభవించిన గ్రామాల్లో ఈత వనాల వద్ద ప్రత్యేకంగా వాటర్ బోర్లు మంజూరు చేసి నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ని ఎమ్మెల్యే కోరారు.ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### నాయకుల పిలుపు





**మెట్పల్లి, మే 30**
బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, ప్రతి కార్యకర్త, అభిమాని సభ్యత్వం పొందేలా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు మెట్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ లోక బాపు రెడ్డి, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ, గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.బి ఆర్ యస్ జిల్లా అధ్యక్షులు విద్య సాగర్ రావు మాట్లాడుతు ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని సూచించారు.అలాగే పార్టీ బలోపేతం, రానున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, కార్యకర్తల పాత్ర, సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.నియోజకవర్గం ఇంచార్జ్ లోక బాపురెడ్డి మాట్లాడుతు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువత, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యత్వం పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి కష్టాన్ని గుర్తిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# త్వరలో 5 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**జగిత్యాల మే 30**
5వేల పోలీసు పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తున్న ట్టు తెలుస్తుంది, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పోలీసు శాఖ నుంచి ఆర్థికశాఖ కు చేరినట్లు సమాచారం తెలంగాణ పోలీసు శాఖలో 19వేలకుపైగా పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దశల వారీగా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్న ట్లు తెలి సింది. ఈ క్రమంలోనే ముందుగా 5వేల పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమైన ట్లు సమాచారం. మిగిలిన 14వేల ఖాళీలను ఆర్థిక శాఖ నుంచి క్లియరెన్స్ రాగానే భర్తీకి చర్యలు తీసు కోవాలని, ప్రభు త్వం భావిస్తుంది.పోలీసుశాఖలో ఇటీవల ప్రతి ఏడాది సుమారు 2వేల మందికిపైగా వివిధ హోదాల్లోని పోలీసులు రిటైర్ అవుతున్నారు. దీంతో ఉన్నవారిపై పనిభారం అధికమవు తోంది. ఈ క్రమంలో రిక్రూట్మెంట్ ప్రక్రియను వేగవంతం చేయను న్నట్లు తెలుస్తోంది.ఈసారి చేపట్టబోయే పోలీసు రిక్రూట్మెంట్ లో ఎంపికైన వారిలో అత్యధికులను దేశాని కి సవాలుగా మారిన



సైబర్ నేరాలు, మత్తు మందుల కట్టడికి సంబంధించిన విభాగాల్లో వాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికా రులను ఆదేశించినట్లు సమాచారం.

# ప్రజాసేవలో పోలీసులు ముందుండాలి

**- నిబద్ధతతో విధులు నిర్వహించాలి - శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి - వీడియో సమావేశంలో డీజీపీ సూచనలు**

**హైదరాబాద్, మే 30**
రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పోలీసు అధికారులకు పలు కీలక దిశానిర్దేశాలు చేశారు. ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, చట్టవ్యవస్థ పరిరక్షణలో ఎలాంటి రాజీ పడకూడదని డీజీపీ స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించేలా సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నితికా



పంత్, అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. జిల్లాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, నేర నియంత్రణ కార్యక్రమాలపై వారు వివరాలు అందించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పారదర్శకమైన పోలీసింగ్ అందించాలన్నదే రాష్ట్ర పోలీసు శాఖ లక్ష్యమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని స్థాయిల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.


# సీబీఎస్ఈ పోర్టల్‌పై సైబర్ దాడి

**- రీవాల్యుయేషన్‌లో గందరగోళం - ఫీజుల్లో భారీ వ్యత్యాసం - అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, మే 30**
సీబీఎస్ఈ రీవాల్యుయేషన్ ప్రక్రియకు సంబంధించిన పేమెంట్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ ఘటనలో దాదాపు 50 మంది విద్యార్థుల ఖాతాల్లోకి అనధికారిక ప్రవేశాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపింది. దీంతో రీవాల్యుయేషన్ ప్రక్రియపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కొత్తగా అమలు చేసిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంపై కొందరు విద్యార్థులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయని ఆరోపిస్తూ బోర్డును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సీబీఎస్ఈ విద్యార్థులకు స్కాన్ చేసిన జవాబు పత్రాల ప్రతులను అందించి, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే రీవాల్యుయేషన్ ఫీజు చెల్లింపుల కోసం ఉపయోగిస్తున్న పేమెంట్ పోర్టల్‌పైనే సైబర్ దాడి జరగడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. ఫీజు చెల్లింపుల సమయంలో అసాధారణ వ్యత్యాసాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా చెల్లించాల్సిన మొత్తానికి బదులుగా కొందరికి కేవలం ఒక రూపాయి, మరికొందరికి దాదాపు అరవై ఎనిమిది వేల రూపాయల వరకు చెల్లింపు మొత్తం చూపించినట్లు వెల్లడించారు. ఈ సమస్య ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ చెల్లింపు గేట్‌వేతో అనుసంధానమైన భాగంలోనే కనిపించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే సాంకేతిక నిపుణులు అప్రమత్తమయ్యారు. ఐఐటీ మద్రాస్, ఐఐటీ కాన్పూర్‌కు చెందిన నిపుణులు సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు.ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం అమలులో భాగంగా మొత్తం తొంభై ఎనిమిది లక్షలకు పైగా జవాబు పత్రాలకు సంబంధించిన దాదాపు నలభై కోట్ల పేజీలను స్కాన్ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటిలో అరవై ఎనిమిది వేల పత్రాల్లో నాణ్యత సమస్యలు తలెత్తడంతో మళ్లీ స్కానింగ్ నిర్వహించినట్లు వెల్లడించింది. విద్యార్థుల ఫిర్యాదుల ఆధారంగా మొత్తం ఇరవై జవాబు పత్రాలు తారుమారైనట్లు గుర్తించి, సంబంధిత విద్యార్థులకు సరైన జవాబు పత్రాలను అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనతో సీబీఎస్ఈ డిజిటల్ వ్యవస్థల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల సమాచారం, పరీక్షల నిర్వహణకు సంబంధించిన కీలక వ్యవస్థలపై మరింత పటిష్ఠమైన సైబర్ భద్రతా చర్యలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

# భార్య వేధింపులతో కారుణ్య మరణం అభ్యర్థన

**- డబ్బుల కోసం ఒత్తిడి - తప్పుడు కేసుల ఆరోపణ - కలెక్టర్‌కు వినతి పత్రం**



**సూరత్, మే 30**
గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరంలో ఓ వ్యక్తి చేసిన వినతి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. భార్య, అత్త వేధింపులు భరించలేక తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ లేఖ రాయడం సంచలనంగా మారింది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, జీవితం కొనసాగించడం కష్టంగా మారిందని ఆయన తన వినతిలో పేర్కొన్నారు. సూరత్‌కు చెందిన కిరిట్ పటేల్‌కు గత ఏడాది స్థానిక మహిళతో వివాహం జరిగింది. వీరిద్దరికీ ఇది మూడో వివాహం కావడం గమనార్హం. వివాహం జరిగిన నాటి నుంచి భార్యతో పాటు అత్త కూడా డబ్బుల కోసం నిరంతరం ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్థిక డిమాండ్లు నెరవేర్చకపోతే వివిధ రకాలుగా మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. తనపై ఆధారరహిత ఆరోపణలు చేస్తూ తప్పుడు ఫిర్యాదులు నమోదు చేస్తున్నారని పటేల్ పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, సామాజికంగా కూడా అవమానాలు ఎదుర్కొంటున్నానని తన లేఖలో వివరించారు. అంతకుముందు తన భార్య వివాహం చేసుకున్న వ్యక్తుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. వారిని కూడా ఇదే తరహాలో వేధించి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం తన వద్ద ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను కోరారు. భార్య వేధింపులపై ఇప్పటికే పోలీసులను ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన రాలేదని పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, తన వాదనను అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో చివరి మార్గంగా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయాల్సి వచ్చిందని తెలిపారు. గృహ హింసకు గురవుతున్న పురుషులకు కూడా తగిన చట్టపరమైన రక్షణ అవసరమని ఆయన తన వినతిలో ప్రస్తావించారు. ప్రస్తుతం తనకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని కోరిన ఈ అభ్యర్థనపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీస్తూ కుటుంబ వివాదాలు, చట్టాల అమలు, పురుషుల హక్కుల అంశాలపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది.

## రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం..

**రాజస్థాన్** రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తుపాను తీవ్ర బీభత్సం సృష్టించింది. థార్ ఎడారి నుంచి వీచిన బలమైన గాలుల కారణంగా ఆకాశమంతా ఇసుక రేణువులు కమ్ముకొని, పగటిపూటే ఒక్కసారిగా చీకట్లు ముసురుకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్‌లోని చురు, బీకనీర్, హనుమాన్‌గఢ్, గంగానగర్ జిల్లాలపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. చురూ పరిసర ప్రాంతాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో భీకరమైన ఈదురు గాలులు వీచాయి. భారీ ఎత్తున లేచిన ఇసుక మేఘాలు యావత్ ప్రాంతాన్నీ చుట్టేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తీవ్రమైన ఇసుక తుపాను ముగిసిన వెంటనే వాతావరణం చల్లబడింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, అంతకుముందు సంభవించిన ఇసుక తుపాను సృష్టించిన బీభత్సం వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అంతకుముందు శుక్రవారం కూడా రాజధాని జైపూర్‌లో ఇలాంటి భీకర వాతావరణమే కనిపించింది. నిన్న ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మారుతున్న ఈ వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ (×వీణ) నిరంతరం పర్యవేక్షిస్తోంది. జైపూర్‌లోని వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లో ఈ తరహా ఇసుక తుఫానులు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఏసీబీ వలలో సైబర్ అధికారి

**- తొమ్మిది లక్షలు డిమాండ్ ఆరోపణ**

**- ఐదు లక్షలు తీసుకుంటూ పట్టివేత**

**హైదరాబాద్, మే 30**



తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్‌పై లంచం ఆరోపణలు సంచలనం సృష్టించాయి. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బత్తుల మహేందర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఓ ఫిర్యాదుదారుడి నుంచి కేసుకు సంబంధించిన అంశంలో సహకారం అందించేందుకు ఇన్‌స్పెక్టర్ మహేందర్ రూ.9 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.5 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఆయనను పట్టుకున్నట్లు తెలిసింది. ఫిర్యాదుదారుడి సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని చర్యలు చేపట్టారు. లంచం నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు రంగంలోకి దిగి సాక్ష్యాధారాలతో పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కలకలం రేగింది. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించనున్నట్లు సమాచారం. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. నగదు స్వాధీనం, ఇతర ఆధారాల సేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేసిన సందర్భాల్లో వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

# శంషాబాద్‌లో అత్యవసరంగా దిగిన విమానం

**సాంకేతిక లోపంతో మారిన మార్గం**

**భయాందోళనలకు గురైన ప్రయాణికులు**

**సురక్షిత ల్యాండింగ్‌తో ఊరట**




**హైదరాబాద్, మే 30**
శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగోకు చెందిన ఓ విమానం అత్యవసరంగా ల్యాండ్ కావడంతో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. బెంగళూరు నుంచి నాగపూర్‌కు బయలుదేరిన ఈ విమానంలో ప్రయాణ మధ్యలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్ అప్రమత్తమై వెంటనే విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి మంజూరు చేశారు. విమానంలో మొత్తం 126 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. సాంకేతిక లోపం గురించి సమాచారం అందడంతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. అయితే పైలట్ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటూ విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.అధికారుల సూచనల మేరకు విమానాశ్రయంలో అత్యవసర సేవలను సిద్ధం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండగా విమానం సురక్షితంగా రన్‌వేపై దిగింది. దీంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే సాంకేతిక నిపుణులు తనిఖీలు చేపట్టారు. లోపానికి గల కారణాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా విమానం నుంచి దించి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.కాగా, వరుసగా రెండు రోజులుగా శంషాబాద్ విమానాశ్రయంలో విమానాలకు సాంకేతిక సమస్యలు తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. నిన్న ఉదయం శంషాబాద్ నుంచి జగ్‌దల్‌పూర్‌కు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం గుర్తించగా, అనంతరం రాజమండ్రికి వెళ్లాల్సిన మరో విమానంలో కూడా సమస్య తలెత్తింది. తాజాగా మరో విమానం అత్యవసరంగా ల్యాండ్ కావడంతో విమాన భద్రతా ప్రమాణాలపై ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే అన్ని సందర్భాల్లోనూ పైలట్లు, సాంకేతిక బృందాలు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం సంబంధిత విమానాల్లో తలెత్తిన లోపాలపై సాంకేతిక పరిశీలనలు కొనసాగుతున్నాయి.

# చదువే జీవితాన్ని మార్చే ఆయుధం

**రంగారెడ్డి, మే 30**
చదువే ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, "అమ్మకు అక్షరమాల", అంగన్వాడీ యూనిఫార్మ్‌ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, విద్య ద్వారానే వ్యక్తి జీవితంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో అన్ని కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలమని సీతక్క పేర్కొన్నారు. బాలికలు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి కీలక స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సంస్కారం కూడా అంతే ముఖ్యమని, తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకుపైగా స్నేహ సంఘాలుగా ఏర్పాటు చేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. మొబైల్ ఫోన్లను కేవలం వినోదానికి మాత్రమే కాకుండా విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని బాలికలకు సూచించారు.



# మీకు ప్రామిస్ చేస్తున్నా!..

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకుంది అగ్ర కథానాయిక కంగనా రనౌత్. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. దాంతో ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేస్తుంటుంది. తాజాగా ఆమె వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అందులో కంగనారనౌత్ మెడలో మంగళసూత్రం, చేతులకు గాజులు ధరించి వివాహితలా కనిపిస్తున్నది. దీంతో ఆమె సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందనే వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా వీటిపై ఆమె క్లారిటీనిచ్చింది. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'నేను షూటింగ్‌లో క్యారెక్టర్ మేకప్‌తో ఉండగా ఎవరో ఈ ఫొటో తీశారు. గత కొన్ని రోజులుగా నా పెళ్లి గురించి ఆరాతీస్తూ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. నటులు అన్ని రకాల పాత్రలు చేయాల్సి ఉంటుంది. గెటప్‌ని చూసి పెళ్లయిపోయిందని అనుకుంటున్నారు. నేను మీ అందరికి ప్రామిస్ చేస్తున్నా. ఎట్టిపరిస్థితుల్లో రహస్యంగా పెళ్లి చేసుకోను. మీ అందరికి చెప్పే పెళ్లి చేసుకుంటా' అని కంగనా రనౌత్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ప్రస్తుతం ఈ భామ 'క్వీన్-2' షూటింగ్‌లో ఉంది. ఈ సినిమాలోని పాత్రకోసమే వివాహిత గెటప్‌లో కనిపించిందని సమాచారం.




# పెళ్లి అయ్యిందని చెప్పడంతో చేజారిన సినిమా ఛాన్స్..

**షాకింగ్ విషయాలు బయటపెట్టిన స్రవంతి**

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

# మూడు సినిమాల నుంచి ఒక్కసారిగా తప్పించారు

**అర్థరాత్రి ఏడ్చేశా: అనసూయ భావోద్వేగ వ్యాఖ్యలు**



టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ నటిగా కొనసాగుతున్నారు. యాంకర్‌గా వచ్చిన గుర్తింపును నటిగా విజయవంతంగా మలుచుకున్న అనసూయ, ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒక బాధాకర సంఘటనను తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కెరీర్ ప్రారంభంలో క్షణం, సోగ్గాడే చిన్ని నాయన వంటి చిత్రాల్లో అవకాశాలు రావడంతో నటిగా మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అయితే ఆమె కెరీర్‌లో నిజమైన మలుపు మాత్రం రంగస్థలం సినిమా ద్వారా వచ్చిందని చెప్పాలి. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా ఘన విజయం సాధించడంతో అనసూయకు నటిగా డిమాండ్ మరింత పెరిగింది. అయితే విజయాలతో పాటు వివాదాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ కూడా తన జీవితంలో భాగమయ్యాయని అనసూయ తెలిపారు. తనపై జరిగే విమర్శలకు, ట్రోల్స్‌కు అవసరమైనప్పుడు గట్టిగానే సమాధానం ఇస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో జరిగిన ఒక బాధాకరమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "ఒక సమయంలో మూడు క్రేజీ సినిమాల కోసం నన్ను ముందుగా ఎంపిక చేశారు. కానీ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఆ ప్రాజెక్టుల నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తీసేశారు? ఏం జరిగింది? అన్న విషయంపై కనీస వివరణ కూడా ఇవ్వలేదు" అని అన్నారు.ఆ సంఘటన తనను తీవ్రంగా బాధించిందని అనసూయ వెల్లడించారు. "ఆ రోజు రాత్రి చాలా బాధేసింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో భర్త దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేశాను. ఆ బాధను జీర్ణించుకోలేకపోయాను" అని చెప్పారు. అలాగే తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలపై కూడా సోషల్ మీడియాలో అనవసర చర్చలు జరిగాయని ఆమె తెలిపారు. నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు వివాదంగా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు అని పేర్కొన్నారు. అయితే ట్రోలింగ్ గురించి పెద్దగా పట్టించుకోనని, కాలక్రమంలో అలాంటి విషయాలను ఎదుర్కోవడం నేర్చుకున్నానని అనసూయ స్పష్టం చేశారు. "ఎవరు ఏమనుకున్నా, ఎన్ని ట్రోల్స్ చేసినా చివరికి నేను నా పనిని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను" అని ధైర్యంగా చెప్పారు.